క్లుప్తంగా

రోడ్డుపై వ్యర్థాలు తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): జీవీఆర్‌నగర్ దావు బుచ్చయ్యకాలనీ మెయిన్ రోడ్డులో బుడమేరు వ్యర్థాల తొలగింపు పనులను శుక్రవారం వీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది చేపట్టారు. ఇక్కడ సుమారు మూడు వారాల క్రితం బుడమేరులో వ్యర్థాలను తొలగించారు. అయితే తొలగించిన వ్యర్థాలను రోడ్డుపై వదలివేశారు. దీంతో రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అలాగే చెత్తాచెదారం పేరుకుపోయి క్రిమికీటకాలకు ఆవాస కేంద్రంగా మారింది. ఈ విషయాలను వివరిస్తూ సాక్షి శుక్రవారం 'రోడ్డుపైనే బుడమేరు వ్యర్థాలు' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించి వీఎంసీ అధికారులు రోడ్డుపై వదలివేసిన చెత్తాచెదారం, బుడమేరు వ్యర్థాలను జేసీబీతో తొలగించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, శానిటరీ మేస్త్రి శ్రీను, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

కట్ట విస్తీర్ణ పనులు శరవేగంగా జరగాలి



పటమట(విజయవాడ తూర్పు): సుందరయ్య నగర్ కట్ట విస్తీర్ణ పనులు శరవేగంగా జరగాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన అజిత్‌సింగ్ నగర్, పైపుల రోడ్డు, సుందరయ్య నగర్ కట్ట, ధర్నా చౌక్ ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సుందరయ్య నగర్ కట్ట విస్తీర్ణంలో భాగంగా ప్రస్తుతం ఉన్న 60 అడుగుల రోడ్డును 80 అడుగుల రోడ్డుగా మారుస్తున్నామని వివరించారు. మరో 20 అడుగుల విస్తీర్ణానికి గురై నష్టపోతున్న 240 ఇళ్ల నివేదికను రెవెన్యూ శాఖకి సమర్పిస్తున్నామని అన్నారు. వీఎంసీ పరిశీలన తర్వాత రెవెన్యూ శాఖ నుంచి వచ్చే జాబితా ఆధారంగా ఇళ్లను కేటాయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన ధర్నా చౌక్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్వచ్ఛత హీ సేవా, స్వచ్ఛ పక్వాడ, స్వచ్ఛ విద్యాలయం కార్యక్రమంలో భాగంగా వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్‌లోని విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. రెడ్యూస్, రీయూస్, రీ–సైకిల్ వంటి అంశాలపై పోస్టర్‌లు తయారు చేయడం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు జరిగాయి. విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తామని పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ మైనం హుస్సేన్ తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వందనం బాబు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రకాష్, కిషోర్, సైదా సాహెబ్ పాల్గొన్నారు.

యువత సాంస్కృతిక అంశాలపై దృష్టి పెట్టాలి

కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఉష



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక అంశాలపై దృష్టి పెట్టాలని కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎస్.ఉష సూచించారు. సిద్ధార్థ కళాశాల, శ్రీదుర్గామల్లేశ్వర సిద్ధార్థ కళాశాల ఆంగ్ల విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మ్యూజ్‌క్రేజ్ పేరుతో సాంస్కృతిక, సాహిత్య పోటీలను సిద్ధార్థ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. సాంస్కృతిక అంశాలపై దృష్టి పెట్టడం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత పెరగడంతో పాటు సృజనాత్మకత పెంపొందుతుందన్నారు. సిద్ధార్థ కళాశాల కన్వీనర్ నిమ్మగడ్డ లలిత ప్రసాద్ మాట్లాడుతూ.. అధ్యాపకులు విద్యార్థులతో మరింతగా మమేకం కావాలన్నారు. ప్రతిఒక్కరూ పుస్తక పఠనం అలవరుచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ మాట్లాడుతూ.. తమ కళాశాల పూర్వ ఆంగ్ల విభాగాధిపతి, సుప్రసిద్ధ కవి వేగుంట మోహన్ ప్రసాద్, విశ్రాంత తెలుగుశాఖాధిపతి, సిద్ధార్థ కళాపీఠం పూర్వ కార్యదర్శి నాగళ్ల గురుప్రసాద్ తమ కళాశాలలో గొప్ప సాహిత్య వాతావరణాన్ని నెలకొల్పారని వివరించారు. సభ అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, పోస్టర్ ప్రజెంటేషన్, స్కిట్ తదితర పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.



పైపులైన్లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



న్యూఆర్ఆర్‌పేట నుంచి అపార్ట్‌మెంట్లకు వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి



ప్రధాన రహదారులపై బ్లీచింగ్ జల్లుతున్న శానిటరీ సిబ్బంది

ఆంక్షలకు విముక్తి ఎప్పుడో..!

- న్యూఆర్ఆర్‌పేటలో డయేరియాతో మూతబడిన దుకాణాలు
- పది రోజులుగా అవస్థలు పడుతున్న ప్రజలు
- డయేరియాకు కారణాలేమిటో ఇప్పటికీ తెలియని వైనం
- ఆర్థిక ఇబ్బందుల్లో వ్యాపారులు



దుకాణాలు మూసివేయడంతో నిర్మానుష్యంగా మారిన సింగ్‌నగర్ - న్యూఆర్ఆర్‌పేట రోడ్డు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): డయేరియా వలయంలో చిక్కుకున్న 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటకు ఇంకా మోక్షం లభించలేదు. దాదాపు పది రోజుల నుంచి ఇక్కడి జనం అనారోగ్యాలతో.. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. మూడు అమాయక ప్రాణాలను బలితీసుకొని.. వందల మందిని వ్యాధి భారిన పడేసిన డయేరియాకు అసలు కారణాలంటో ఇప్పటి వరకు తెలియకపోవడం విడ్డూరం.



క్యాన్‌ల నుంచి నీళ్లను పట్టుకుంటున్న మహిళలు

బోసిపోయిన వీధులు

గతేడాది వచ్చిన బుడమేరు వరదల సమయంలో ఇక్కడి ప్రాంతాలు ఏ విధంగా అయితే నిర్మానుష్యంగా మారి.. బ్లీచింగ్ వాసనల మధ్య మగ్గిపోయిందో.. నేడు న్యూరాజరాజేశ్వరీపేట పరిస్థితి అదే విధంగా కనిపిస్తోంది. గత పదిరోజుల నుంచి ఈ ప్రాంతంలోని టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, బార్‌లు, బేకరీలు, మాంసం దుకాణాలన్నీ బంద్ కావడంతో న్యూఆర్ఆర్‌పేటతో పాటు సింగ్‌నగర్, నందమూరినగర్‌లోని పలు ప్రాంతాలు సైతం మూగబోయాయి. నిత్యం వేలమంది జనం రాకపోకలతో.. చిన్నారుల ఆటపాటలతో కనిపించే వీధులన్నీ బోసిపోయి దర్శనమిస్తున్నాయి. అసలు డయేరియాకు కారణాలేమిటో.. ఇంకా ఎన్నిరోజులు ఇలా ఉండాలో ఇప్పటి వరకు అధికారికంగా ఒక్కరు కూడా సమాధానం చెప్పడం లేదు.

కాలువల్లో కదలని మురుగు

డయేరియా బారినపడిన న్యూఆర్ఆర్‌పేటలో పారిశుద్ధ్య విభాగ పనితీరు ఇంకా మెరుగుపడలేదు. డయేరియా సమస్య వల్ల పలు డివిజన్ల నుంచి శానిటరీ విభాగ అధికారులు, సిబ్బంది ఇక్కడకు వచ్చినా.. క్షేత్రస్థాయిలో ఇక్కడ మురుగు సమస్యలకు పరిష్కారం చూపలేకపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా గతేడాది బుడమేరు వరదల దగ్గర నుంచి నేటి వరకూ కాలువల్లో పూడికలు సక్రమంగా తీయడం లేదని.. దీనివల్ల మురుగు నెలల తరబడి పేరుకుపోయి దుర్వాసనలు రావడం, దోమలకు నివాస కేంద్రాలుగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

ట్యాంక్‌లు శుభ్రం చేయించాం

న్యూరాజరాజేశ్వరీపేటలోని వాటర్ పైపులైన్‌లు అన్నింటినీ తనిఖీ చేయగా రెండు చోట్ల లీకులు కనిపించాయి. వాటితో పాటు 500 మీటర్ల మేర కొత్త పైపులైన్‌లను ఏర్పాటు చేస్తున్నాం. వాటర్ ట్యాంక్‌తో పాటు ఇళ్లకు వెళ్లే లైన్లు, అపార్ట్‌మెంట్ లైన్లు అన్నింటినీ పరిశీలించాం. వాటర్ ట్యాంక్‌తో పాటు అపార్ట్‌మెంట్లపై ఉన్న వాటర్ ట్యాంక్‌లు అన్నీ కూడా శుభ్రం చేయించాం.

–మాధవ్, వాటర్ సప్లయి ఏఈ

ఆర్థిక ఇబ్బందులు



పది రోజుల నుంచి టిఫిన్ బళ్లు, హోటళ్లు అన్నీ మూసివేయించారు. అప్పులు చేసి టిఫిన్ బండ్లు పెట్టుకున్నాం. ఇన్ని రోజులు పని లేకపోతే అప్పులు, వడ్డీలు పెరిగిపోతున్నాయి. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మా ఇబ్బందులను గుర్తించి వ్యాపారాలు జరిగేలా చూడాలి.

–ఎస్‌కే హసీనా, టిఫిన్ బండి నిర్వాహకురాలు

చేతిలో చిల్లిగవ్వ లేదు



ప్రతి రోజూ టీలు అమ్మి వచ్చిన డబ్బుతో ఇంట్లో గడిచేది. వ్యాపారాలు మూసివేయడంతో చేతిలో చిల్లిగవ్వ లేదు. ఇంట్లో వండుకోవడానికి కూడా చాలా ఇబ్బందిగా ఉంది. ఇంకా ఎన్ని రోజులిలా ఉండాలో అర్థం కావడం లేదు. ఇలానే ఉంటే మాలాంటి కుటుంబాలన్నీ రోడ్డున పడే దుస్థితి వస్తుందేమోనని భయంగా ఉంది.

–శ్రీను, టీస్టాల్ నిర్వాహకుడు

జీవితాలు ఛిద్రం



గతేడాది బుడమేరు వరదలు.. ఇప్పుడు డయేరియా వచ్చి మా జీవితాలను ఛిద్రం చేస్తున్నాయి. డ్రెయినేజీ, తాగునీటి పైపులు కలవకుండా, లీకులు లేకుండా చేస్తే ఇటువంటి సమస్యలేవి తలెత్తవు. మాలాంటి నిరుపేదలు పడుతున్న అవస్థలను గుర్తించి మేము వ్యాపారాలు చేసుకునేలా అధికారులు అవకాశం కల్పించాలి.

–ఇయాజ్, చికెన్‌షాపు వ్యాపారి

పిల్లలకు పోషకాహారం కీలకం



పాయకాపురం(విజయవాడరూరల్): పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి పోషకాహారం అత్యంత ముఖ్యమైనదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. శుక్రవారం వాంబే కాలనీ హెచ్ బ్లాక్‌లో విజయవాహిని ఛారిటబుల్ ట్రస్ట్, టాటా ట్రస్ట్, ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నాగమణి మాట్లాడుతూ ప్రతి ఇంటిలో సులభంగా దొరికే ధాన్యాలు, కూరగాయలు, పాలు, గుడ్లు, పప్పులు వంటి వాటితో పోషక విలువలు గల ఆహార పదార్థాలను తయారు చేయవచ్చునన్నారు. అలాగే ఐసీడీఎస్ ద్వారా అందజేస్తున్న టీహెచ్‌ఆర్ కిట్‌లోని ఆహార పదార్థాలను వినియోగించడం వల్ల తల్లి, శిశువు ఆరోగ్యవంతంగా ఉండగలరని చెప్పారు. విజయవాహిని చారిటబుల్, టాటా ట్రస్ట్ ప్రోగ్రాం అసోసియేట్ గాయత్రి మాట్లాడుతూ పోషకాహార లోపం మన సమాజంలో ఇంకా ప్రధాన సమస్యగానే ఉందన్నారు. దీన్ని అధిగమించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయ స్వామి దేవాలయ ధర్మకర్తల మండలి నియామక ఉత్తర్వులను దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ జారీ చేసిందని ఆలయ ఈఓ పాతూరి లోకేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులుగా బోడిశెట్టి కృష్ణప్రసాద్, అడబాల కృష్ణాజీ, మంచికంటి ధనలక్ష్మి, నెక్కంటి వీవీ సత్యవరప్రసాద్, కూర్మాపు దుర్గారావు, మద్దాల రుక్మిణి బాయమ్మ, బొమ్మదేవర రత్నకుమారి, త్రిపురనేని వెంకటేశ్వరరావు, పాలగాని భాగ్యలక్ష్మి, లబ్బ దుర్గ, ఆల శ్రీకాంత్ యాదవ్, గోవర్ధన వెంకటచార్యులు, ముఖ్య అర్చకులు ఎక్స్ అఫిషియో సభ్యులుగా నియమితులయ్యారని చెప్పారు. నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఈనెల 22న జరుగుతుందని ఆమె తెలిపారు.

12న ఏపీ కురుబ సంఘ వార్షికోత్సవం



వాల్ పోస్టర్ ఆవిష్కరించిన తట్టి అర్జునరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ కురుబ సంఘం 10వ వార్షికోత్సవం వచ్చే నెల 12వ తేదీన తాడేపల్లి గూడెంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తట్టి అర్జునరావు తెలిపారు. శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో వార్షికోత్సవ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలందరూ ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకోవాలని సూచించారు. తద్వారా గణనీయమైన అభివృద్ధి సాధించవచ్చని పేర్కొన్నారు. 10వ వార్షికోత్సవ సభకు రాష్ట్ర, జాతీయ నాయకులు హాజరవుతారని తెలిపారు. దేశ జనాభాలో అగ్రభాగం బీసీలదే అయినా రాజ్యాధికారంలో వెనుకబడి ఉన్నారన్నారు. రాజ్యాధికారి సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. వార్షికోత్సవ కార్యక్రమానికి బీసీలందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాస్, విఠల్ గౌడ్, శ్రీనివాస్, శివ, అనిల్, కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి సిద్ధార్థ ప్రాంగణంలో దసరా మహోత్సవాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో మూడో దసరా మహోత్సవాలను ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకూ వైభవోపేతంగా నిర్వహించనున్నామని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను చురుగ్గా చేస్తున్నట్లు వారు వివరించారు. వేడుకల్లో భాగంగా హోమాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. మహోత్సవాల్లో రోజూ ఉదయం గోపూజ, గణపతి పూజ, మహిళలతో సుహాసిని కుంకుమ పూజ.. పల్లకీ సేవ, కల్యాణం, తీర్థ ప్రసాదాల పంపిణీ చేయనున్నామని పేర్కొన్నారు. చండీహోమం, మహాలింగార్చన, రుద్రహోమములు, లలితా సహస్ర పారాయణం వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నామని.. మహిళలు పాల్గొనవచ్చునని నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మశ్రీ గండికోట సుబ్రహ్మణ్య శర్మ పర్యవేక్షణలో వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని అన్నారు.

ప్రత్యేక అలంకరణలు..

ఉత్సవాల్లో తొలిరోజైన 22న బాలత్రిపుర సుందరీదేవిగా, 2వ రోజు గాయత్రిదేవిగా, 3వ రోజు అన్నపూర్ణదేవిగా అమ్మవారు దర్శనమీయనున్నారు. 4వ రోజు శివకామసుందరీదేవి, 5వ రోజు మహాలక్ష్మిదేవి, 6వ రోజు లలితా త్రిపుర సుందరీదేవి, 7వ రోజు చండీమాత, 8వ రోజు సరస్వతిదేవి, 9వ రోజు దుర్గాదేవి, 10వ రోజు మహిషాసుర మర్దిని, దసరా రోజు శ్రీ విజయ రాజేశ్వరిగా భక్తులకు అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారని నిర్వాహకులు తెలిపారు. అక్టోబరు 1న మహా ప్రభోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నామని అన్నారు. ఆధ్యాత్మికంగా నిర్వహించే ఉత్సవాలను గతేడాది విజయవంతం చేసినట్లే, ఈ ఏడాది కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు అందుకోవాలని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

వాహన మిత్ర దరఖాస్తు గడువు పెంచాలి

సీఐటీయూ ప్రధాన కార్యదర్శి దుర్గారావు



మాట్లాడుతున్న మాట్లాడుతున్న దుర్గారావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆటో, క్యాబ్ డ్రైవర్లు వాహన మిత్ర పథకం కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించాలని విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు కోరారు. స్థానిక బీఆర్టీఎస్ రోడ్డులోని నండూరి ప్రసాద్‌రావు భవన్ సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం యూనియన్ కార్యదర్శి ఎం.హనుమంతరావు అధ్యక్షతన ఆటో కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఆటో, క్యాబ్ డ్రైవర్లకు వాహన మిత్ర పథకం అమలు కోసం ఈనెల 17, 18, 19 తేదీల్లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో డ్రైవర్లు సచివాలయాలు చుట్టూ కిరాయిలు మానుకొని తిరుగుతున్నారన్నారు. వాహన మిత్ర అమలు కావాలంటే పథకానికి అనేక ఆంక్షలు పెట్టడంతో దరఖాస్తులు చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికీ చాలామంది దరఖాస్తులు చేసుకోలేకపోయారని చెప్పారు. దీంతోపాటు సచివాలయాల్లో సర్వర్లు సరిగా పనిచేయకపోవడంతోపాటు మరికొన్ని సచివాలయాల్లో పూర్తిగా ఆగిపోయాయన్నారు. కావున ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించాలని కోరారు. అలాగే 300 యూనిట్లు కరెంట్ బిల్లులు వస్తే వాహన మిత్ర పథకానికి అర్హులు కాదని, ఐటీ రిటన్స్, వెయ్యి చదరపు గజాల ఇల్లు, క్యాస్ట్ సర్టిఫికెట్, ఈ చలనాలు పెండింగ్ వంటి ఆంక్షలు ఎత్తివేయాలని దుర్గారావు కోరారు. సమావేశంలో వివిధ స్టాండ్‌ల బాధ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన గవర్నర్‌పేట స్టేషన్ పరిధిలోని హనుమాన్‌పేటలో జరిగింది. హనుమాన్‌పేట నంబూరు గోపాలరావు వీధికి చెందిన పసుపులేటి శివ ఆరోగ్యం సరిగా లేక ఇంటి వద్దనే ఉంటున్నారు. గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

అంతరాలయంలో ఫొటో తీసిన వ్యక్తిపై ఫిర్యాదు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): అమ్మవారి ప్రధాన ఆలయంలో ఫొటో తీసిన వ్యక్తిపై దుర్గగుడి అధికారులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. దసరా ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించేందుకు గురువారం పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి తన పార్టీ నాయకులతో కలిసి ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. తొలుత అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయానికి విచ్చేసిన సుజనా చౌదరి వెంట కొందరు అమ్మవారి ప్రధాన ఆలయంలోకి వెళ్లారు. కాగా సుజనా చౌదరి వెంట ఉన్న ఓ వ్యక్తి తన ఫోన్ తీసి ఆలయంలో నాయకులను ఫొటో తీశాడు. దీంతో బంగారు వాకిలి వద్ద ఉన్న ఆలయ సిబ్బంది ఈ వ్యవహారాన్ని ఆలయ ఈఓ శీనానాయక్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆలయ అధికారులు దీనిపై చర్చించిన అనంతరం ఫొటో తీసిన వ్యక్తిపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. గురువారం రాత్రి వన్‌టౌన్ పోలీసులకు ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఘటనపై ఫిర్యాదు చేశారు. గత నెల 27వ తేదీ వినాయక చవితి నుంచి అమ్మవారి ఆలయంలోకి సెల్‌ఫోన్లను తీసుకుని వెళ్లడంపై నిషేధం విధించిన సంగతి తెలిసిందే.

లాటరీ టికెట్స్ విక్రేత అరెస్ట్

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): లాటరీ టికెట్స్ విక్రేతపై భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కృష్ణలంక పచ్చమేడ ప్రాంతానికి చెందిన వరిపెంట నాగార్జునరెడ్డి వెంకట రమణ డోర్స్ షాప్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అతను సైడ్ బిజినెస్‌గా లాటరీ టికెట్స్ అమ్ముతుంటాడు. తమిళనాడుకు చెందిన అరుణాచలం ఇతనికి వాట్సాప్‌లో లాటరీ టికెట్స్ నంబర్స్ పంపుతుంటాడు. వాటిని నాగార్జునరెడ్డి ప్రింట్ తీసి తనకు తెలిసిన వారికి వాట్సాప్‌లో నంబర్లు పెడతాడు. ఇందుకు ఒక్కో టికెట్‌కు రూ.50 నుంచి రూ.150 వరకు తీసుకుంటాడు. అలా టికెట్స్ వచ్చిన సొమ్మును అరుణాచలంకు ఫోన్ పే ద్వారా పంపిస్తాడు. నాగార్జునరెడ్డి కమిషన్ కింద కొంత మొత్తం తీసుకుంటాడు. శుక్రవారం లాటరీ టికెట్స్ విక్రయిస్తుండగా పోలీసుల కంట పడ్డాడు. వారిని చూసి పారిపోతుండగా పోలీసులు పట్టుకుని విచారించి నాగార్జునరెడ్డిపై కేసు నమోదు చేశారు.

ఔషధ భద్రతపై అవగాహన వాక్‌థాన్



కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజల్లో ఔషధ భద్రతపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ సిద్ధార్థ మెడికల్ కాలేజ్ ఫార్మకోలాజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం వాక్–ఎ–థాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గవర్నమెంట్ నర్సింగ్ కాలేజ్, విజయ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సిద్ధార్థ మెడికల్ కాలేజ్ ఫ్యాకల్టీ, విద్యార్థులు, సిబ్బంది కూడా భాగస్వాములయ్యారు. ఈ వాక్–ఎ–థాన్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వర రావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కార్యక్రమ ఉద్దేశాన్ని ప్రసంగించారు.

నగరాభివృద్ధికి నిరంతరం కృషి

వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు: విజయవాడ నగరాభివృద్ధికి తాము నిరంతరం కృషి చేస్తున్నామని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో స్థాయిసంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. విజయవాడ నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో అజెండాలో మొత్తం 22 అంశాలు రాగా వాటిని ఆమోదిస్తూ తీర్మానించారు. ఒక అంశాన్ని రికార్డు చేయగా మరో అంశాన్ని ధృవీకరించారు.

ప్రధానాంశాలు..

30వ డివిజన్‌లోని గద్దె వెంకటరామయ్య నగర్‌లో నిర్మాణం పూర్తయిన రిజర్వాయర్ నుంచి స్థానికంగా తాగునీటి సరఫరా కోసం నూతనంగా పైపులు వేయాల్సి ఉంది. ఈ పైపులైన్లకు అవసరమైన రూ.49.55 లక్షలను వీఎంసీ సాధారణ నిధుల నుంచి వెచ్చించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు. ఇంద్రకీలాద్రిపై జరిగే దసరా మహోత్సవాల్లో భక్తుల తాగునీటి సరఫరాకు నీళ్ల సీసాలను అందించేందుకు అవసరమైన రూ.99.96 లక్షలను వీఎంసీ సాధారణ నిధుల నుంచి వెచ్చించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదం తెలిపారు.

గ్రీన్ హైడ్రోజన్‌పై అవగాహన సదస్సు



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో అతిథులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): భవిష్యత్తులో ఇంధన అవసరాలకు గ్రీన్ హైడ్రోజన్ అనే అంశంపై శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో రెండు రోజుల వర్క్‌షాపు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సదస్సులో కృష్ణా యూనివర్సిటీ రిటైర్డ్ డీన్ మండవ బసవేశ్వరరావు, యూఎస్ యూనివర్సిటీ కెమికల్ ఇంజినీరింగు ప్రొఫెసర్ డాక్టర్ సుంకర మహేంద్రలతో పాటు పలువురు నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీ, దాని తయారీ విధానం, రవాణా, సరఫరా వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. భవిష్యత్తులో గ్రీన్ హైడ్రోజన్ ప్రభావాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ఎస్.కల్పన, ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎలక్యూషన్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. సదస్సులో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

నందీశ్వరుడికి అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బహుళ త్రయోదశిని పురస్కరించుకుని భీమనవారిపేటలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలోని నందీశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నందీశ్వరుడికి ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మలు పంచామృతాలు, పండ్లరసాలతో అభిషేకించారు. స్వామి వారికి నిర్వహించిన అభిషేకాల్లో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. అభిషేకాల అనంతరం పంచహారతుల సేవను నిర్వహించారు.